ప్రజాశక్తి

సోమవారం 22 జులై 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

రాష్ట్ర హక్కుల కోసం నిలబడాలి

టిడిపి ఎంపీలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హితవు

▲ మెయిన్ లో

పాకలలో ఒడ్డున ఉన్న బోట్లు, వలలు



అల్పపీడనం ప్రభావంతో


సముద్రంలో ఆగిన వేట

ఒడ్డుకు చేరిన బోట్లు, వలలు

▲ 7లో

'వెలుగొండ'కు

నిధుల కేటాయింపే కీలకం



- మార్కాపురం జిల్లా ఏర్పాటుపైనా ఆశలు
- జిల్లాకు రూ.10 వేల కోట్లు ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం డిమాండ్
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. బడ్జెట్ కూడా సమావేశాల్లో ఉంటుంది. దీంతో సమావేశాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సభ్యుల ప్రమాణాల కోసం గత నెలలో రెండు రోజుల పాటు సమావేశాలు జరిగాయి. సమస్యలపై పెద్దగా చర్చలు ఏమీ లేవు. ఇప్పుడు జరిగే సమావేశాలే ప్రాధాన్యతగా భావిస్తున్నారు. ఎందుకంటే ఈ ఏడాది బడ్జెట్‌ను సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఇప్పుడు అందరి ఆశలూ నిధుల కేటాయింపులపైనే ఉన్నాయి.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వాటిని నిధులే కీలకం. శాసనభ్యులు కూడా కేటాయింపులపైనే దృష్టి సారించారు. సభలో గళం విప్పడానికి ప్రతిపక్ష సభ్యులు కూడా చాలా తక్కువగానే ఉన్నారు. జిల్లా నుంచి ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలున్నారు. పాలకపక్ష సభ్యులే కీలకపాత్ర పోషించాల్సి ఉంది. ఎక్కువ నిధులు రాబట్టుకునేందుకు విశ్వప్రయత్నాలు చేయాలనే చర్చ సాగుతోంది. ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు నిధుల్లేకనే ముందుకు సాగలేదు. మూడు జిల్లాల పరిధిలో 4.473 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించే వెలుగొండకు నిధులు ఇవ్వాలి. నిర్వాసితులకు ప్యాకేజీల కోసం రూ.1200 కోట్లు కావాలి. అయితే గతేడాది హడావుడిగా దీన్ని అప్పటి సిఎం జగన్ ప్రారంభించారు. పూర్తి చేయకుండానే ప్రారంభించారనే విమర్శలూ, చర్చలూ సాగుతున్నాయి. చంద్రబాబు ఎన్నికల్లో దీనిపై హామీలు ఇచ్చారు. ఈ మేరకు నిధులివ్వాలి. పునరావాసం కల్పించాలి. ఓటాన్ బడ్జెట్‌లో దీనికి రూ.1544.04 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇప్పుడు ఎంత ఇస్తారన్నదే చూడాలి. గతేడాది బడ్జెట్‌లో కేవలం రూ.101.47 కోట్లు మాత్రమే కేటాయించారు. గుండ్లకమ్మ గేట్లు తెగిపోయాయి. నిర్వహణ గాలికి వదిలేశారు. దీనికి కూడా ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.106.46 కోట్లు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. దీనికి కొత్త ప్రభుత్వం ఏ మేరకు నిధులు ఇస్తుందో చూడాలి. ఎందుకంటే ఈ ప్రాజెక్టు నిర్వాసితులు, భూసేకరణ అంశాలు, పునరావాసం వంటివి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహించే అద్దంకి నియోజవర్గ పరిధిలోకే వస్తాయి. ఆయనకు కూడా ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత అంశాల్లో ఉంది. మరో మంత్రి వీరాంజనేయస్వామి నియోజకవర్గం పరిధిలో ఉన్న పాలేరు రిజర్వాయర్‌కు నిధుల్లేనే పనులు మొదలు కాలేదు. వీటితో పాటు మీడియం, మధ్యతరహా ప్రాజెక్టులు, సాగర్ కాలువ ఆధునీకరణ పనులకు నిధుల కొరత ఉంది. వీటికి నామమాత్రపు కేటాయింపులే చూపుతున్నారు. చేసిన పనులకు కూడా బిల్లులు రాలేదనే చర్చ సాగుతోంది. వీటితో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులపై ఆశలు పెట్టుకున్నారు. దొనకొండ, కనిగిరి పారిశ్రామిక వాడలు తెరపైకి వచ్చాయి. వీటిపైనా ఎన్నికల్లో హామీలు ఇచ్చారు. జిల్లా డెయిరీపైనా హామీలు ఇచ్చారు. నియోజకవర్గాల్లో ▶ 2లో

కట్టేటప్పుడు కళ్లు మూసుకున్నారా..?

- అక్రమ కట్టడాలంటూ ఇప్పుడు నోటీసులు
- 95 మందికి నోటీసులు ఇచ్చినట్లు స్వయంగా ప్రకటించిన ఎమ్మెల్యే
- అనధికారిక లే అవుట్లలో అడ్డగోలు దోపిడీ
- వైసిపి పాలనలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదాయం
- కొత్త ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న నిబంధనల ఉల్లంఘన



గాంధీనగర్ ఓపిఎస్ స్కూల్‌ను అనుకొని రెండు వైపుల సెట్ బ్యాకులు లేకుండా నిర్మించిన బహుళ అంతస్తుల భవనం.. ముందు వైపు డ్రెయినేజీ వరకు చదును చేసిన దృశ్యం..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని గాంధీనగర్‌లోని ఓపిఎస్ స్కూల్ పక్కన ఓ వ్యక్తి డ్రెయినేజీని ఆనుకొని షాపులు కడుతున్నాడు. డ్రెయినేజీకి, కట్టడానికి మధ్య బెత్తెడు కూడా ఖాళీ స్థలం లేదు. ఇటీవలే ఈ కట్టడం జరుగుతోంది. ఇప్పుడే పనులు ప్రారంభదశలో ఉన్నాయి. రోడ్డు మీద జనాలకు కనిపించకుండా పట్ట కట్టి మరీ కట్టడాలు చేస్తున్నారు. ఆ షాపుల నిర్మాణం డ్రెయినేజీని ఆనుకొని చేస్తుండటంతో రేపు షాపుల వద్దకు వచ్చే వాహనాలు ఎక్కడ పార్కు చేస్తారో అర్థం కాని పరిస్థితి.

ఆ పక్కనే ఓపిఎస్ స్కూల్‌ను ఆనుకొని ఓ భారీ కట్టడం ఉంది. జిప్లస్ 3 నిర్మాణం చేశారు. రెండు వైపులా అస్సలు సెట్ బ్యాక్‌లే లేవు. వీళ్లు మురుగు కాలువ వరకు స్థలాన్ని చదును చేసుకున్నారు. అండర్ గ్రౌండ్‌లో పార్కింగ్ చూపించినా భవిష్యత్తులో దాన్ని వాడకుండా భారీ కట్టడానికి ముందు వాహనాలు ఆపుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మంగమూరు రోడ్డు బైపాస్ జంక్షన్ నుంచి ఆశ్రమం వరకు 120 అడుగులుగా రోడ్డు విస్తరణ చేయాలని మాస్టర్‌ప్లాన్‌లో ఉంది. అంత విస్తరణ చేయడం ఆచరణలో సాధ్యం కాదు కాబట్టి ఆ ప్రాంతంలో పెరిగిన జనాభా, కట్టడాలకు అనుగునంగా భవిష్యత్తులో కనీసం వంద అడుగులైనా చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు గాంధీనగర్ ఏరియాలో రోడ్డు వెడల్పు ఎటుచూసినా అరవై అడుగుల లోపే.. అంటే సగానికి సగం రోడ్డుకు ఇరువైపులా స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. మాస్టర్ ప్లాన్ రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్ల విస్తరణ కోసం గతంలో మార్కింగ్ చేసిన స్థలాలను సైతం ఆక్రమించి కట్టడాలు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

ఇక నగరంలో అక్రమ కట్టడాలు, అనధికారిక లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఏ సందులో చూసినా, ఏ గొందిలో చూసినా బహుళ అంతస్తుల నిర్మాణాలే.. ఒకటీ అర మినహా ఏ ఒక్కటీ నిబంధనలకు లోబడి లేవు. నగరంలో 95 అక్రమ కట్టడాలు, అనధికారిక లే అవుట్లు ఉన్నట్లు గుర్తించి.. ఇటీవల కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు సాక్షాత్తూ ▶ 2లో



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ప్రయాణికుల భద్రతకు

అత్యంత ప్రాధాన్యత

- ఉచిత బస్సు ప్రయాణంపై విధావిధానాల రూపకల్పన
- ఐదు కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రయాణికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర, సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయో వద్ధుల సంక్షేమం, సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు డిపోలో ఆదివారం రెండు కొత్త స్టార్ లైన్, మూడు సూపర్ లగ్జరీ బస్సులను మంత్రి డిబివి స్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా ఒంగోలు డిపోలో 5 కొత్త బస్సులను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో 25 శాతం బస్సులను రీప్లేస్ చేయడం మంచి పరిణామమన్నారు. కాలం చెల్లిన బస్సులన్నింటినీ రీప్లేస్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పవిత్ర పుణ్య క్షేత్రం తిరుపతికి ప్రాధాన్యతను ఇస్తూ తిరుపతికి కూడా స్లీపర్ కోచ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి రీజినల్ మేనేజర్‌కు సూచించారు. గత పదిరోజులలో 4 నూతన స్టార్ లైన్ బస్సులు, 5 సూపర్ లగ్జరీ ▶ 2లో

నిధుల కేటాయింపే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

పలు సమస్యలపై ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన నేతలు ప్రజలకు ఎన్నికల్లో హామీలు ఇచ్చారు. వీటిని ఆచరణలో పెట్టాల్సి ఉంది. ఇక కొత్త జిల్లాల ఏర్పాటు ఎజెండాగా మారింది. మార్కాపురం జిల్లా విషయం కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే చర్చలోకి వచ్చింది. దీనిపై ఎమ్మెల్యేలపైనా ఒత్తిళ్లు చేస్తున్నారు. పాలకపక్ష నేతలు నలుగురు చేరినచోట మార్కాపురం జిల్లా ఎప్పుడు.? అని అడుగుతున్నారు. ఒంగోలు జిల్లాలోనూ అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను విలీనం చేయాల్సి ఉంది. అన్నిటికన్నా దీనిపైనే ప్రజల్లో ఉత్కంఠగా ఉంది. ఎందుకంటే అద్దంకి నుంచి బాపట్ల జిల్లాకు వెళ్లడం కష్టంగా మారింది. అదేవిధంగా నెల్లూరు పోయే బాధ ఎప్పుడు తప్పుతుందా? అని కందుకూరు నియోజకవర్గ నేతలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. బాపట్ల జిల్లా ఏర్పాటైనా అక్కడ మౌలిక సదుపాయాల కల్పన దిశగా పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇంకా తాగునీరు, డ్రైనేజీల ఏర్పాటుపైనా హామీలున్నాయి. ఇక వెనుకబడిన జిల్లాకు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం కోరుతోంది. గతంలోనే ఈ ఎజెండాతో ఆందోళనలూ చేపట్టింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, హక్కుల కోసం పార్లమెంటు సభ్యులు అక్కడ గళం విప్పాల్సిన అవసరం ఉంది.

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

బస్సులను ప్రారంభించామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయటానికి విధివిధానాల రూపకల్పనలో ఉన్నామన్నారు. భవిష్యత్తులో విడతల వారీగా పాడైన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేశారు. మంచి సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్న ఆర్‌టిసి బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి జిల్లా ప్రజలను కోరారు. ఆర్టీసి రీజనల్ మేనేజర్ బి.సుధాకర్ మాట్లాడుతూ ఒంగోలు రీజియన్‌లో పాడైన బస్సుల స్థానంలో 67 కొత్త బస్సులు వచ్చాయని, సుమారు 20 నుంచి 25 శాతం కొత్త బస్సులు నడుస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మిగతా జిల్లాల్లో కంటే మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు డిపో మేనేజర్ డి శ్రీనివాసులు, ట్రాఫిక్ సిఐ షయానా బేగం, ఆర్టీసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టేటప్పుడు కళ్లు మూసుకున్నారా.?

(మొదటిపేజీ తరువాయి)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనే ప్రకటించారు. దాదాపు 150 మందికి నోటీసులు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా చెప్పుకొచ్చారు. ఇంత పెద్దమొత్తంలో అక్రమ కట్టడాలు చేస్తుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారు.? అనధికారిక లేఅవుట్లమీద ఎలాంటి చర్యలు తీసుకోక పోవడానికి గల కారణాలు ఏంటి..? అన్నది ప్రశ్నార్ధకంగా మారింది.

ఇప్పుడు నోటీసులిచ్చి ఉపయోగమేంటో...?

అనధికారిక కట్టడాలు, లే అవుట్లకు సంబంధించి 95 మందికి నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన అనధికారిక కట్టడాలలో 90శాతం నిర్మాణాలు పూర్తయి నవే.. అనధికారిక లే అవుట్లలో కూడా మెజారిటీ స్థలాలు విక్రయించినవే. ఇంత పెద్దమొత్తంలో అక్రమాలు జరిగాయంటే అంతే పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనధికారిక కట్టడాలకు ఫ్లోర్‌కు ఇంతని వసూలు చేస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాల్లో ఒక్కో అనధికారిక ఫ్లోర్‌కు లక్ష నుంచి మూడు లక్షల వరకు వసూలు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే అనధి కారిక కట్టడాలు జరిగిపోయిన తరువాత వారికి నోటీసులు ఇచ్చి ఉపయోగం ఏంటి..? అన్నదే.

అనధికారికంగా చేసిన కట్టడాలను అధికారులు కూల్చడం లేదు. అలాంటి చర్యలు నగరంలో దాదాపు పదేళ్లుగా ఎక్కడా లేవు. అంటే అక్రమ కట్టడాల మాటున అధికారులు కోట్లాది రూపాయలు మమూళ్లు వసూలు చేశారని స్పష్టమవుతోంది. ఇప్పుడు నోటీసులు ఇచ్చిన 95 మంది వద్ద కూడా ఈ పాటికే బేరాలు మొదలవగా.. అందులో మెజారిటీ కట్టడాలు చేసినవారు అధికారులకు గతంలో చేతులు తడిపినవారే ఉన్నట్లు సమాచారం. ఒకసారి డబ్బులు తీసుకొని అక్రమాలను ప్రోత్సహించిన తరువాత ఇప్పుడెందుకు నోటీసులు ఇస్తున్నారని కట్టడాలు చేసేవారే వాపోతున్నారు కట్టడాలు చేసే టప్పుడు అధికారులు కళ్లు మూసుకున్నారా...? నోట్ల కట్టల మాటున వారి కళ్లు మూసుకు పోయాయా..? అనేవిమర్శలు వినిపిస్తున్నాయి.

వైసిపి పాలనలో దోచేశారు.!

వైసిపి పాలనలో అనధికారిక కట్టడాలు, అనధికారిక లే అవుట్ల మాటున అధికారులు, అధికార పార్టీ నేతలు భారీగా దోచేశారని తెలుస్తోంది. 95 చోట్ల అక్రమాలు జరిగాయని నోటీసులు ఇచ్చారంటే ఆ అక్రమాల వెనుక ఏమాత్రం చేతులు మారయనేది కూడా అర్ధమవుతోంది. అయితే ఈ దోపిడీలో టౌన్‌ప్లానింగ్ అధికారులదే కీలక పాత్ర. అందులోనూ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ హెడ్‌గా ఉన్న వ్యక్తికి కార్పొరేషన్ పాలకవర్గ పెద్దలతోనూ మంచి సంబంధాలు ఉండటంతో టౌన్‌ప్లానింగ్‌లో జరిగే అవినీతికి అడ్డుఅదుపు లేకుండా పోయిందనే విమర్శ ఉంది. కొన్ని అక్రమ కట్టడాలను వైసిపి కార్పొరేటర్లే ప్రోత్సహించడం, అక్రమ కట్టడాలు చేసేవారి దగ్గరికి వెళ్లి డబ్బులు వసూలు చేయడం లాంటి వ్యవహారాలు కూడా గత ప్రభుత్వంలో జోరుగా జరిగాయి. ఈ వ్యవహారం అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి వెళ్లినా ఆయన చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమార్కుల దోపిడీ పెద్దఎత్తున కొనసాగిందనే చర్చ జరుగుతోంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా నగరంలో అక్కడక్కడా అనధికారిక కట్టడాలు ప్రారంభమయ్యాయి. నగరానికి నాలుగువైపులా కొత్త లేఅవుట్లు వస్తున్నాయి. అక్రమాల పట్ల, అవినీతి అధికారుల పట్ల కొత్త ప్రభుత్వం, స్థానిక నాయకులు ఎలా వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది.

ఏడో రోజు రిలే దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి డిపోలో యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. సంఘం డిపో నాయకులు బి రోషన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఆదివారం నాటి నిరాహార దీక్షకు డ్రైవర్‌లు కెపి బాబు, సిహెచ్‌సి ఎస్ బాబులకు మాజీ సిసిఎస్ గెలిగేట్ కొండలు, ఏడిసి జోనల్ నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు పూలమాలవేసి దీక్ష శిబిరం ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారని తెలిపారు. సమస్యలు పరిష్కరించేంతవరకు రిలే దీక్షలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన టిడిపి సీనియర్ నాయకులు యర్రారెడ్డి

సిఎంను కలిసిన టిడిపి సీనియర్ నాయకులు

ప్రజాశక్తి-పొదిలి

మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, సర్పంచ్ చిన్నపరెడ్డి సుబ్బులు భర్త చిన్నపురెడ్డి యర్రారెడ్డి శనివారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రిగా చంద్రబాబును కలవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని యర్రారెడ్డి విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపినట్లు యర్రారెడ్డి వివరించారు.

గేదెల గుంపును ఢీకొని ..

ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా

- ఇద్దరు ప్రయాణికులు మృతి
- మూడు గేదెలు కూడా..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రహదారిపై అడ్డంగా ఉన్న గేదెల గుంపును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు. మూడు గేదెలు కూడా చనిపోయాయి. ఈ ఘటన మండల పరిధిలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి అనంతపురం వెళుతున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 35 మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఈ బస్సు తిప్పాయపాలెం వద్ద జాతీయ రహదారిపై అడ్డుగా ఉన్న గేదెల గుంపును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో అనంతపురం జిల్లా, ధర్మవరం చెందిన గజ్జల శివయ్య(42), విజయవాడకు చెందిన కుర్ర విజయలక్ష్మి(52) అక్కడికక్కడే మృతిచెందారు.



బోల్తా కొట్టిన ప్రైవేటు బస్సు

తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో గమనించిన స్థానికులు, వాహనదారులు హైవే రెస్క్యూ టీంకు సమాచారం అందించారు. హైవే రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని స్వల్ప గాయాలైన ముగ్గురు ప్రయాణికులను హైవే ఆంబులెన్స్ సహాయంతో మార్కాపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాదం నుంచి తేరుకున్న మిగతా ప్రయాణికులు ఒకరికొకరు సహాయం చేసుకుంటూ బస్సులో నుంచి బయటకు వచ్చి ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా తమ గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లిపోయారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న బస్సును క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్ బస్సు ప్రమాదానికి గురైన తీరును పరిశీలించారు. స్థానికులు, ప్రయాణికుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం

- కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. తీగలు క్రిందకు వేలాడుతున్నాయి. చేయి ఎత్తితే తగిలేవిధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు బెంబెలెత్తున్నారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒగి ప్రమాదభరితంగా ఉన్నాయి. మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు వేలాడుతున్న విద్యుత్ వైర్లు, ఒరిగిన స్తంభాలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరుఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారే తప్పా మరమ్మతులు



రక్షణ వలం ఏర్పాటు చేయని ట్రాన్స్‌ఫార్మర్


చేపట్టిన దాఖలాలు లేవు. పలు గ్రామాల్లో ప్రజలు నిత్యం సంచారిస్తే ప్రాంతాల్లో ట్రాన్స్ ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. వాటి వల్ల పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఉప్పుగుండూరులో ఎస్‌సి కాలనీలో రెండు ప్రైవేటు పాఠశాలల వద్ద తక్కువ ఎత్తులో ట్రాన్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయలేదు. ట్రాన్‌ఫార్మర్లు సమీపం నుంచి నిత్యం విద్యార్థులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. మండల పరిధిలోని కండ్లగుంట ,మద్దిరాలపాడు చీర్వానుప్పలపాడు గామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎక్కడ ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గురుపౌర్ణమి వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్ర శేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయకుమార్,బి. వెంకటేశ్వర్లు, వెంకటరావు పాల్గొన్నారు.

చీమకుర్తి : స్థానిక హరిహరక్షేత్రంలో గురుపౌర్ణమి



చీమకుర్తిలో పూజలు నిర్వహిస్తున్న శిద్దా దంపతులు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి స్వామి

వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మిపద్మావతి పాల్గొని పూజలు చేశారు.అనంతరం హోమాలు నిర్వహించారు. స్థానిక షిర్డిసాయి మందిరంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో మద్దిపాడు ఎఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని కాలేజీ రోడ్డులోనున్న సాయిబాబా దేవస్థానంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక



గిద్దలూరులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దేవస్థాన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దప్పిలి కాశిరెడ్డి, భాస్కర్ రెడ్డి, డాక్టర్ జెవి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : తర్లుపాడులోని శ్రీషిర్డీ సాయిబాబాబు మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రస్ట్ ఛైర్మన్ మాదాల నాగ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన నాగేంద్ర

గాలిపటం తీస్తుండగా ..
విద్యుత్ షాక్ తో బాలుడు మృతి

ప్రజాశక్తి - గిద్దలూరు

విద్యుత్ షాక్‌తో ఓ బాలుడు మతి చెందాడు. ఈ ఘటన గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పాఠశాలకు ఆదివారం సెలవు కావడం కొండాపేట గ్రామానికి చెంది ఆలపాటి నాగేంద్ర(10), తన స్నేహితులతో కలసి గాలి పటం ఎగురవేస్తున్నాడు. గాలి పటం సమీపంలోని చెట్టు ఉన్న విద్యుత్ వైర్లపై పడింది. చెట్టు ఎక్కి గాలి పటం తీస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై నాగేంద్ర (10) అక్కడిక్కడే మతిచెందాడు. మృతుడు నాగేంద్ర కొండపేటలోని ఎంపియుపి స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్



ఆత్మహత్య చేసుకున్న హమీద్

రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాయవరం రైల్వే స్టేషన్ నుండి గజ్జలకొండ గ్రామానికి వెళ్లే రైలు మార్గంలో 143/20-21 మైలు రాయి వద్ద చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మార్కాపురానికి చెందిన షేక్ హమీద్ (61) భార్య ఎడాది క్రితం అనారోగ్య కారణాలతో మతి చెందింది. అప్పటి నుంచి తాను ఒంటరిని అయ్యానని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల వద్ద హమీద్ ఆవేదన చెందేవాడు. కుటుంబ సభ్యులు. బంధుమిత్రులు ఓదారుస్తూ వస్తున్నారు. తన భార్య మీద ఉన్న ప్రేమతో హమీద్ ఇటీవల రూ. 25 లక్షలు వెచ్చించి ఆమె పేరిట పెద్ద నాగులవరం రోడ్డులో ఉన్న ఈద్గా ఆవరణంలో మసీదును నిర్మించారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కుటుంబ సభ్యులకు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రి వరకూ రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హమీద్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ఘటనా స్థలం వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారు కార్డు ఆధారంగా మృతుడు హమీద్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడు హమీద్ అని తెలిపారు. భార్య మృతిచెందడంతో మనస్తాపానికి గురైన హమీద్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు.

రెండు గృహాల్లో చోరీ

ప్రజాశక్తి -కంభం రూరల్ : కంభంలోని సంగావీధిలో రెండు గృహాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తొలుత రహంతుల్లా అనే కొబ్బరి బొండాల వ్యాపారి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని రెండు బీరువాలను పగులగొట్టి రెండు తులాల బంగారం, రూ.5 వేలు నగదును అపహరించారు. అనంతరం అదే వీధికి చెందిన సతీష్ పల్సర్‌కు అపహరించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను పిలించి ఘటనా స్థలంలో వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య హాజరయ్యారు. ఈపురిపాలెం సాయి బాబా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. పట్టణంలోని బెస్తపాలెం సాయిబాబా మందిర పూజల్లోను పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బోస్‌నగర్‌లోని సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. మండలంలోని జాండ్రపేట సాయిబాబా మందిరం వద్ద ఎమ్మెల్యే కొండయ్య తనయుడు మహేంద్ర నాథ్ పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

భీమలింగేశ్వర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి - పంగులూరు



బాచిన వెంకటేశ్వర్లు (78)

పంగులూరులోని భీమలింగేశ్వర స్వామి దేవాల య పాలక మండలి మాజీ చైర్మన్ బాచిన వెంకటేశ్వర్లు (78) శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు నిర్వహిం చారు. 2018 నుంచి 2024 మార్చి వరకు గ్రామంలోని భీమ లింగేశ్వర స్వామి దేవాలయం పాలక మండలి చైర్మన్‌గా పనిచేశారు. ఈ కాలంలో దేవాలయ అభివృద్ధికి కృషి చేశారు. ఇటీవల ఆయనకు పక్షవాతం రావడం, ఆరోగ్య దెబ్బతినడంతో ఆయన మరణించారు. వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని మాజీ శాసన సభ్యులు డాక్టర్ బాచిన చెంచు గరటయ్య, మాజీ జెడ్పిటిసి బాచిన చెంచు ప్రసాద్, పలువురు నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య సుబ్బారావమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైసిపి నాయకుడు అంజిరెడ్డి మృతి

ప్రజాశక్తి - పంగులూరు



భీమనాదం అంజిరెడ్డి (62)

వైసిపి రాష్ట్ర నాయకులు వైవి సుబ్బారెడ్డి బంధువు, మండలంలోని కొండమూ రు గ్రామానికి చెందిన భీమనాదం అంజిరెడ్డి (62) ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు శుక్రవారం తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందడంతో మృతదేహాన్ని స్వగ్రామమైన కొండమూరుకు తీసుకువచ్చారు. ఆయన భార్య భీమనాదం సీతాదేవి ఇటీవల వరకు కోటపాడు వ్యవసాయ పరపతి సంఘానికి అధ్యక్షురాలుగా పనిచేశారు. అంజిరెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే వైసిపి ఇన్చార్జి పానెం చిన్నహనిమిరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ వైవి భద్రారెడ్డి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అంజిరెడ్డి మరణం పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారుడు సుబ్బారెడ్డి, కుమార్తె పద్మ ఉన్నారు. అమెరికాలో ఉన్న మనవరాలు సాయిశ్వేత వచ్చిన తర్వాత మంగళవారం అంజిరెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు

వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు అన్నారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. శిక్షణకు సిఐటియు అధ్యక్షుడు ఎన్ బాబురావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. వర్తమాన పరిస్థితులు కార్మికుల కర్తవ్యం అంశంపై నాయకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు ఏర్పడినను కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు యజమానులకు అనుకూలంగా మారుస్తుందని ఆరోపించారు. దేశంలో కోటి 50 లక్షల మంది స్కీం వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలని అన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలపై పోరాటం చేయాలని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు పెంచే మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రేఖ, కె సింగయ్య, జి సురేష్, బి సత్యమూర్తి, ఏసురత్నం పాల్గొన్నారు.

పల్లెకోనలో టైక్వాండో పోటీలు



టైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న వేములపల్లి రవి కిరణ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన గ్రామంలోని పర్చూరు రఘుబాబు, సుబరామిరెడ్డి కళా పరిషత్తు ప్రాంగణంలో ఆత్మకూరు టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల టైక్వాండ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల ను ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు వేముల పల్లి రవికిరణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ఉపాధ్యాయులు సురేష్ కుమార్ అధ్యక్షత వహిం చారు. పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 180 మంది బాలికలు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పాల్గొన్నట్లు సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలపై జరుగు తున్న అకృత్యాలు, అత్యాచారాలను ఎదుర్కొనేందుకు బాలికలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పడం అవసరమని అన్నారు. కరాటే శిక్షణ ఎంతో దోహద పడుతుందని అన్నారు. బాలికలు దీని పట్ల మక్కువ కలిగి పోటీల్లో ఇంత మంది పాల్గొనడ అభినందనీయమని అన్నారు. ఆసక్తితో ఉత్తమ శిక్షణ పొంది ఎవరికి వారు వ్యక్తిగతంగా తమను తాము కాపాడుకునే విధంగా శిక్షణ కలిగి ఉండాలని సూచించారు. నిర్వాహకులను ఆయన అభినం దించారు. ఎబిసి అండ్ ఎఫ్ టైక్వాండో రేపల్లె కోచ్, నేషన ల్ రిఫర్ ఎ డేవిడ్ మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయటానికి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టైక్వాండో కోచ్‌లు, టిడిపి నాయకులు రామ కోటేశ్వరరావు, రాయన ప్రసాదరావు, వేములపల్లి రాఘవేంద్రరావు, వేములపల్లి రత్న గోపాలరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టైక్వాండో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

లూథరన్ చర్చికి సహకారం అందిస్తాం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం అద్దేపల్లిలోని లూథరన్ క్రీస్తు దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలుగుదేశం బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందర్రావు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు వై కరుణ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పోకూరి సురేంద్ర తెలిపారు. చర్చి అభివృద్ధి కొరకు సంఘ పాస్టర్, చర్చి పెద్దలు సహకారం అందించాలని కోరడంతో శాసన సభ్యులు నక్క ఆనందబాబు ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారాలు చర్చి అభివృద్ధికి అందజేస్తామని భరోసానిచ్చారు. చర్చి అభివృద్ధికి కృషిచేస్తామని హామీనిచ్చిన బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందర్రావు, వై కరుణ శ్రీనివాసరావును సంఘ పెద్దలు చర్చిలో ఆదివారం దృశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి గొట్టుముక్కల లెనిన్, ఎడ్ల చిట్టిబాబు, పప్పల ప్రసాదు, చీకటి శ్రీనివాసరావు, కంభం రమేష్, నీలా డేవిడ్, పప్పల మనోజ్ పాల్గొన్నారు.



టిడిపి నేతలను అభినందిస్తున్న చర్చి సంఘ పెద్దలు

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువులకు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న గురువులను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో గురు పూర్ణిమ సందర్భంగా గురువు లను సత్కరించారు. ఈ సందర్భంగా రోజు వ్యాయామం చేయించే గురువు అమరా వీరాంజనేయులు, గ్రూపులోని ఉపాధ్యాయులు తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, చందలూరి బాల వెంకటేశ్వరరావు, కొమ్మూరి వీరాంజనే యులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరి చారగుళ్ల ప్రసాద్, జివై ప్రసాద్, పి వెంకటస్వామి, దేగల తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, నారాయణమూర్తి, రాంబాబు, వాకింగ్ మిత్రులు పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు




ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవారి పాలెంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అద్దంకి మాజీ శాసన సభ్యులు డాక్టర్ బి చెంచు గరటయ్య, చీరాల గోవర్ధనరెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గుండ్రెడ్డి శివ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

ఉపాధి కూలీలక వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కార్మికులకు ఐదు వారాల బకాయిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో పాల్గొనాలని మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో కరపత్రాలు ఆదివారం పంపిణీ చేశారు. రెండు నెల క్రితం ఎలక్షన్‌కి ముందు ఐదు వారాలు చేసిన పనికి ఇప్పటి వరకు కూలీల బిల్లులు ఇవ్వలేదని వ్యవసాయ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. గ్రామాల్లో నిలిచిన ఉపాధి హామీ పథకం పనులు తిరిగి ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. కార్మికులకు ఫే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. నిరసనకు హాజరు కావాలని కరపత్ర ప్రచారం చేశారు.



కుష్టు వ్యాధిగ్రస్తులకు అన్నదానం చేస్తున్న సుబ్రహ్మణ్యం

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - బాపట్ల

కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం పంచాయతీ సర్పంచి, వైసిపి నాయకులు మాడా సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భంగా ఆదివారం సేవా కార్యక్రమాలు చేశారు. స్థానిక ఏరియా వైద్యశాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వెదుళ్లపల్లి బదురుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలో 1వ వార్డు బేతని కాలని కుష్టు వ్యాధి గ్రస్తులకు అన్నదానం చేశారు. కాలనీ వాసులకు బియ్యం పంపిణీ చేశారు. వెదుళ్ళపల్లి దివ్యాంగుల కాలనిలో దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో విస్తృతంగా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, పెదగొల్లపాలెం పంచాయతీ సర్పంచ్ ఎల్లావుల నాని, చింతయపాలెం వైసిపి నాయకులు దొప్పలపూడి అప్పారావు, ఇసుకుల కేశవరెడ్డి, షేక్ తాజుద్దీన్, చల్లా రామయ్య, రాజా, లక్ష్మారెడ్డి, ఆట్ల మురళీకృష్ణారెడ్డి, కుంభాగోపి, గరిగంటి కిరణ్, సురేష్, పిన్నిబోయిన నాగరాజు పాల్గొన్నారు.

రొయ్య పిల్లల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి సురేష్



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

హేచరీల నుంచి రొయ్య పిల్లలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి సురేష్ తెలిపారు. ఆక్వా ఉత్పత్తి రాష్ట్ర ఆర్థికాభివద్ధి, జిల్లా రైతులకు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనేక మందికి ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. తీర ప్రాంతంలో ఎందుకూ పనికిరాని భూముల్లో రైతులు కష్టపడి సంపద సష్టిస్తున్నారన్నారు. 2020లో కరోనా తర్వాత ఆక్వా ఎగుమతులపై నీలినీడలు కమ్ముకున్నట్లు తెలిపారు. అదేవిధంఅ రొయ్యలలో నిషేధించిన యాంటీ బయాటిక్స్ ఉన్నట్లు తెలిపారు. రొయ్యలు అమ్మకానికి వచ్చినప్పుడు రేట్లు తగ్గిపోవటం, పెట్టుబడులు పెరిగిపోవటం, వ్యాధుల సమస్యలతో ఆక్వా రైతు సతమతమవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో రొయ్యపిల్లల్లో నాణ్యత లోపిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా టైగర్ రొయ్య పిల్లల నాణ్యత లోపించి బాపట్ల, ప్రకాశం జిల్లా రైతులు నష్టపోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా ఉండటానికి విత్తనచట్టం తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా నాణ్యతా ప్రమాణాలు పాటించని హేచరీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోటానికి, రైతులకు నష్టపరిహారం ఇప్పించే అవకాశం ఉందన్నారు. ఈ చట్టం గురించి అవగాహన లేక ఆక్వా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. హేచరీల నుంచి రొయ్య పిల్లలు, ఆక్వా షాపుల నుంచి మేతలు, మందులు కొనుగోలు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలా చేయడం వల్ల నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు.

రైతులు చేస్తున్న పొరపాట్లు..

బోనస్ ఎక్కువ వస్తుందని రిజిస్ట్రర్ కాని హేచరీల నుంచి కొందరు రైతులు రొయ్య పిల్లలు కొనుగోలు చేస్తున్నారు. వాటికి బిల్లులు కూడా తీసుకోవడం లేదు. రొయ్య పిల్లలు కొనుగోలు చేసే ముందు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం లేదు. మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. అప్పు తక్కువ వయస్సు కలిగిన రొయ్య పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. శాంపిల్ రొయ్య పిల్లను తీసుకోవడం లేదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ వారి వద్ద రిజిస్టర్ అయిన హేచరీల నుంచే రొయ్య పిల్లలు కొనుగోలు చేయాలి. కొనే ముందు పిల్లలను ఆక్వాల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవాలి. హేచరీ నుంచి ఆక్వా చెరువు యజమాని పేరుతో బిల్లు విధిగా తీసుకోవాలి. కొనుగోలు చేస్తున్న పిల్లలను శాంపిల్(100 పిల్లలు) ను ఆల్కహాల్‌లో ఉంచి సీల్ చేసిన మూడు డబ్బా లేదా సీసాల్లో ఉంచాలి. చెరువులో పిల్లలను వేసే ముందు చెరువులోని నీరు మరియు మట్టిని పరీక్షించుకొవాలి. వ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే పిల్లలు చెరువులోకి వదలాలి. బిల్లులు, వ్యాధులు నిర్ధారణ రిపోర్టులు, నీటి పరీక్షలు పంట దిగుబడేంతవరకు భద్రంగా ఉంచుకోవాలి. చిన్న వయసు పిల్లలు కాకుండా శాస్త్రీయంగా సిఫార్సు చేసిన పిల్లలను మాత్రమే కొనుగోలు చేయాలి. అయినప్పటికీ ఆక్వా రైతులు నష్టపోతే కొనుగోలు బిల్లులు, ల్యాబ్ టెస్ట్ రిపోర్టులు, ఫొటోతో సమీపంలోని మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారి వాటిని పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

మంత్రి స్వామి



ప్రజాశక్తి-టంగుటూరు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ పేదలకు రైతు బజార్లలో రాయితీ పై నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కంది పప్పు కిలో రూ.160, సోనా మసూరి బియ్యం కిలో రూ.49 అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి రూ. 5లకే పేదల ఆకలి తీర్చనున్నట్లు మంత్రి స్వామి పేర్కొన్నారు.

మనోహర్‌కు సురేష్ పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు



మనోహర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్

వైసిపి జరుగుమల్లి మండల కన్వీర్ బత్తిన మనోహర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య చికిత్స అనంతరం ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. అందులో భాగంగా వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ వావిలేటిపాడు లోని బత్తిన మనోహర్ నివాసానికి ఆదివారం వెళ్ళి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి వెంట వైసిపి నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, దుంపా అనిల్ కుమార్ రెడ్డి, పాటిబండ్ల నాగేశ్వరరావు, పుట్టా వెంకట్రావు, చెన్నారెడ్డి మాలకొండయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిరాడంబరి శ్రీసాయి గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం



గ్రంథావిష్కరణలో కవులు, రచయితలు

మార్కాపురం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి మల్లిక్ రచించిన నిరాడంబరి శ్రీ సాయి గ్రంథావిష్కరణ గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ దత్తసాయి రామాలయంలో సాయిబాబా భక్తుల సమక్షంలో ఆదివారం ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు రాష్ట్రపతి అవార్డు గ్రహీత తంగిరాల నాగ జగన్నాథ్ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు కొండ్రెడ్డి వేంకటేశ్వరరెడ్డి సమగ్రంగా గ్రంథ సమీక్ష నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, తోట శ్రీనివాసరావు, కొండ్రెడ్డి నాగిరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని పలు గ్రామాలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు, నిడమానూరు, నాగులుప్పలపాడు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా వాసవీక్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకట సురేష్ బాబు ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు మేకల మగ్గారావు కుమారుడు పవన్ కుమార్ ఇంటర్ చదువుకోవడానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవాకార్యకర్త శామ్యూల్ , అమరా వేణు, నాగవెంకట వరప్రసాదు, ఉప్పల శ్రీను, దత్తసాయి కోల్డ్ స్టోరేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నియోజక వర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో ఎంపిపి కడప లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి ఎంపిపి కడప లక్ష్మి, ఎంపిడిఒ హేమలతా దేవి, కార్యాలయ సిబ్బంది శాలువాలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గం అభివద్ధే తన ధ్యేయమని తెలిపాడు. ప్రభుత్వం నుంచి అధిక నిదులు రాబట్టి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని చెప్పారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కిష్ణంశెట్టిపల్లెలో పశు వైద్యశాలకు భవనాన్ని నిర్మించాలని పశువైద్యాధికారులు ఎమ్మెల్యేను కోరారు. ఇరిగేషన్ అధికారి మాట్లాడుతూ మండలంలో మొత్తం 38 చెరువుల ఉండగా 12 చెరువుల కట్టలు తెగిపోయినట్లు తెలిపారు. వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. అనంతరం కౌలు రైతులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్ , వివిధ శాఖల అధికారులు, సర్పంచులు , ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజాసేవలో సంతృప్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీమకుర్తి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజలకు సేవలు అందించడానికే తాను రాజకీయాలలోకి వచ్చానని, దానిలోనే సంతృప్తి ఉందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ పేర్కొన్నారు. తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆదివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నూనె హేమసుందరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదిమందికి మంచి చేయాలని తాను ఆలోచిస్తూ ఉంటానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువ పారిశ్రామికవేత్త శిద్దాసుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయకుమార్ మంచి మనిషి అని తెలిపారు. అనంతరం సుందర్శన గ్రానైట్ అధినేతలు, ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళల ఆధ్వర్యంలో వెండి కిరీటంతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీనారాయణ, సుదర్శన గ్రానైట్ అధినేత నూనె వెంకటసుబ్రహ్మణ్యం, వాసవీ సత్ర సముదాయాల చైర్మనర్ శిద్దా నాగేశ్వరరావు, వాసవీ గ్రానైట్ అధినేత శిద్దా పాండురంగారావు,ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు శిద్దా సుధాకర్, హరిప్రియ గ్రానైట్ నూనె అనుదీప్, నూనె వంశీకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు మద్ది వెంకటరావు, దుడ్డు రంగనాయకులు, పచ్చిపులుసు సుబ్బారావు, కె.వడ్డికాసులు, కంకర మిల్లుల అసోసియేషన్ ప్రతినిధి బొమ్మిశెట్టి మధుసూధనరావు, నూకల సురేంద్ర, టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ళ గంగాధరరావు, పూనాటి వెంకటరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, మన్నం వెంకయ్య, సూరంపల్లి హనుమంతరావు, ఎ.వెంగన్న, జనసేన నాయకులు కె.బాబు, టి.శ్రీరామ్, 13వ వార్డు కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి,12వ వార్డు కౌన్సిలర్ గోరంట్ల అంజలి తదితరులు పాల్గొన్నారు.

'గోకులాల' నిర్మాణానికి అనుమతి

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి హనుమంతరావు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకం దారులకు షెడ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. షెడ్ల నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపడతారని తలెఇపారు. 2,4 లేదా 6 పశువులు, 20 నుంచి 50 గొర్రెలు, మేకలు, 100 నుంచి 200 కోళ్లకు ఒక యూనిట్ మంజూరు చేస్తారని తెలిపారు. పశువుల షెడ్లకు 90శాతం, గొర్రెలు, మేకల, కోళ్ళు షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తారన్నారు మిగిలినది రైతు వాటా లేదా వేజ్ కాంపోనెంట్ కింద జమచేస్తారన్నారు. జిల్లాలోని కోస్తా మండలాలకు 300 మరియు మెరక మండలాలకు 475 కలిపి మొత్తం 775 యూనిట్లు లక్ష్యమని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న రైతులు, సంచారజాతులు, పిఎంఎవై లబ్దిదారులు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులు, ఒంటరి మహిళలు, చిన్నకారు మరియు సన్నకారు రైతులు షెడ్లు నిర్మించుకొనేందుకు అర్హులని తెలిపారు. గోకులాల నిర్మాణాలకు 2 పశువులకు రూ. 1,15,000 యూనిట్ ధర కాగా అందులో రూ 1,03,500 రాయితీ ఉంటుందన్నారు. రైతులు రూ.11,500 చెల్లిం చాల్సి ఉంటుందన్నారు. 4 పశువులకు యూనిట్ ధర రూ. 1,85,000 కాగా సబ్సిడీ రూ1,66,500 పోనూ రైతులు రూ. 18,500 చెల్లించాలన్నారు.6 పశువుల కంటే ఎక్కువ ఉంటే యూనిట్ ధర రూ 2,30, 000 కాగా రాయితీ రూ. 2,07,500 ఇస్తారని తెలిపారు. రైతులు రూ.23 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.


గోకులాల నమూనా షెడ్డు


హనుమంతరావు

గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్లకు సంబదించి యూనిట్ విలువ

షెడ్డు	యూనిట్ ధర	రాయితీ	రైతు వాటా
20 గొర్రెలు లేదా మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లకు	87,00	60,900	26,100
200 కోళ్ళకు	1,32,000	92,000	39,600


నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలుకు చెందిన కాకర్ల మస్తానయ్య గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు.ఈ విషయం గురించి తెలుసుకున్న దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారు మస్తానయ్యకు నిత్యావసర వస్తువులు ఆదివారం అందజేశారు. గిద్దలూరుకు చెందిన ప్రసన్న సప్లయర్స్ నిర్వాహకులు 25 కేజీల బియ్యం అందజేశారు. ఎడవల్లి అర్జున్ ఐదు కిలోల నూనె, దివ్య ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులు ఇతర సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లోక్కు శరత్ బాబు, సుమన్, సిద్ధయ్య, సునీల్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, విద్యార్థులు గ్రంథాయాల్లోని పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రాఫిక్‌లో చికుకున్న బస్సు, ఆటోలు

చీమకుర్తిలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలో నిత్యం ట్రాఫిక్ స్తంభించి పోతుంది. పాత బస్టాండ్ సెంటర్ వద్ద వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం కలుగుతోంది. పాతబస్టాండ్ సెంటర్ వద్ద రోడ్డు కిరువైపులా ఒంగోలు, పొదిలి వైపు వెళ్ళడానికి రెండు వైపులా బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. బస్సుల కోసం,ఆటోల కోసం ప్రయాణికులు అక్కడ వేచి ఉంటారు. ఇతర వాహనాలు,గ్రానైట్ కార్మికులను తరలించే వాహనాలు,ప్రైవేటు పాఠశాలల బస్సులు, బైకులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆటోలు బస్టాండ్‌లో వచ్చేపోయే వాహనాలకు అడ్డదిడ్డంగా పెడుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గతంలో ఇక్కడ ఓ ఆర్‌టిసి అధికారి ఉండి ఆటోలు నిలుపుదల చేయకుండా చూసేవారు. ఆ అధికారిని ఆరు నెలల క్రితం తొలగించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. గతంలో బస్టాండ్ సెంటర్‌లో ఇద్దరు పోలీసు సిబ్బందిని నియమించి ట్రాఫిక్ అదుపుచేసేవారు. ఇప్పుడు అక్కడ పోలీసులు ఉంటటం లేదు. ఫలితంగా ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ రికార్డులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

రీసర్వే పెండింగ్ రికార్డులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పల్లా ప్రసాదు సర్వేయర్లను ఆదేచించారు. గిద్దలూరు, కొమరోలు,రాచర్ల మండలాల మండల, గ్రామ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల రీ సర్వే పెండింగ్‌పై చర్చించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ , మూడు మండలాల సర్వేయర్లు సంజీవయ్య శిలార్, ఆంజనేయులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు


మాట్లాడుతున్న పల్లా ప్రసాద్

పోలేరమ్మ కొలుపుల్లో దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని తూర్పు నాయుడు పాలెంలో పోలేరమ్మ కొలుపులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు ఎడ్ల బండ్లు కట్టారు. బండ్లను పూల మందిరాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం పోలేరమ్మ గుడి చుట్టూ ఎడ్ల బండ్లు తిరిగాయి. ఈ వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తల్లపనేని రవి కుమార్, టిడిపి నాయకులు పాతూరి వెంకటేశ్వర్లు, దామచర్ల పిచ్చన్న పాల్గొన్నారు.


ఎడ్ల బండిపై దామచర్ల సత్య

రజకులపై దాడులు అరికట్టాలి

ఎపి రజక చైతన్య రాష్ట్ర అధ్యక్షుడు 'పోలిశెట్టి

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో రజకులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని, ఈ దుర్మార్గాలను నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి రజక చైతన్య రాష్ట్ర అధ్యక్షుడు పోలిశెట్టి తిరుపతయ్య ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, డిజిపి ద్వారా పోలీసు యంత్రాంగానికి రెండు చేతులెత్తి వేడుకుంటున్నామని పేర్కొన్నారు. సమాజంలో ప్రజలకు సేవ చేసే నిస్సహాయకులైన రజక జాతి ప్రస్తుతం హత్యలకు గురికావడం బాధాకరమన్నారు.రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చి రజకుల, రజక మహిళల మానప్రాణాలతో బతికే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. గత వారం రోజుల కిందట నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రజక జాతికి చెందిన శ్రీనును దారుణంగా దాడి హత్య చేసిన ఘటన మరువక ముందే మరో రజక వత్తిదారుడి దారుణ హత్య చేసిన ఘటన వెలుగులోకి రావడం భయానక పరిస్థితులకు గురిచేస్తుందన్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం కొత్తకోట సమీపంలో వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా నరికి హత్య చేశారన్నారు. తక్షణమే రజకులపై జరుగుతున్న దాడులు అరికట్టి, బాధ్యులైనటువంటి వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి చట్ట ప్రకారం వారికి కఠినమైన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా రజకుల్లో మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. లేకుంటే రజకుల తరఫున పోరాటాలకు సిద్ధం కాక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చనిపోయిన రజకుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జన విజ్ఞాన వేదిక

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మార్కాపురం

జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. జయప్రకాష్ మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా మూఢనమ్మకాల నిరోధానికి, పర్యావరణ పరిరక్షణకు, విద్య, ఆరోగ్యం, సామాజిక అభివద్ధికి, సాంస్కతిక వికాసానికి, దేశ స్వావలంబన కోసం జన విజ్ఞాన వేదిక కషి చేస్తుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం కోసం వారిలో దాగివున్న సజనాత్మక శక్తిని వెలికితీయడం కోసం కషి చేస్తుందన్నారు. గత కార్యక్రమాలను సమీక్షిస్తూ, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన చేసుకునేందుకు ఆగస్టు 10న నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక వార్షిక సభలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మూఢ విశ్వాసాల వల్ల యువత, మహిళలు,సాధారణ ప్రజలతో పాటు విద్యావంతులు సైతం ఆర్థికంగా, భౌతికంగానూ నష్టాల పాలవుతున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బి శరత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను ఆరోగ్యం పట్ల చైతన్యవంతమైన కార్యక్రమాలను జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తుందన్నారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యవర్గ సభ్యులు జడ్డా రమణయ్య, వరికుంట్ల వెంకటేశ్వర్లు, డి.దేవప్రసాద్, సయ్యద్ రఫీ, ఉదయగిరి వెంకట్రావు, ఏనుగుల రవికుమార్, నారపురెడ్డి రమణారెడ్డి, కోటి మోహన్, తగరపు నాసరయ్య, జె.శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



బీమా చెక్కు అందజేస్తున్న నాగబాబు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-త్రిపురాంతకం

జనసేన సభ్యత్వం కలిగిన త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కామిశెట్టి బాల నాసరయ్య గత ఏడాది అక్టోబర్ 27న రోడ్డు ప్రమాదంలో మరణించారు. దాంతో కామిశెట్టి బాల నాసరయ్య నామినీగా ఉన్న రాజీకి ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి డాక్టర్ పాకనాటి గౌతంరాజు పాల్గొన్నారు.

కంభం రూరల్: తురిమెల్ల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త లంకా లక్ష్మణమూర్తి గత జనవరిలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆదివారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు రూ.5 లక్షల బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జనసేన గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయి బాబు, రియాజ్, నరసింహారావు పాల్గొన్నారు.

అనైతిక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు

- తాలూకా సిఐ షేక్ ఖాజావలి - స్పా సెంటర్ల దాడుల్లో 17 మందిపై కేసులు నమోదు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పా సెంటర్ల పేరుతో చట్ట విరుద్ధమైన, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తాలూకా సిఐ షేక్ ఖాజావలి హెచ్చరించారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో స్పా సెంటర్లపై జరిగిన దాడులలో నిందితులపై పెట్టిన కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈసందర్భంగా తాలూకా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ముగ్గురు సిఐలు, 10 మంది ఎస్సైలు, సిబ్బందితో కలిసి శనివారం ఒంగోలు నగరంలోని ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలోని 16 స్పా సెంటర్లపై ప్రత్యేక బందాలు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారన్నారు. ఇందులో 6 స్పా సెంటర్లకు లైసెన్సులు లేవని, 3 స్పా సెంటర్లు నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. స్పా సెంటర్ల పైన జరిపిన దాడులలో గుంటూరు రోడ్డులోని సారాబ్యూటీ సెలూన్- స్పా సెంటర్ లో నిబంధనలకు విరుద్ధంగా అనైతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించి స్పా సెంటర్ నిర్వాహకుడు, ఐదుగురు మహిళలతో అనైతిక కార్యక్రమాలకు పాల్గొనేందుకు వచ్చిన కేరళ రాష్ట్రం కోజికోడ్‌కు చెందిన కొడువాలిల్ నితిన్, మార్కాపురం పట్టణానికి చెందిన ఈత అవినాష్, కనమర్లపూడి పద్మనాభం, సారా స్పా సెంటర్ నిర్వాహకుడు కిమిడి పవన్ కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడి జరిగిన సమయంలో తప్పించుకున్న ఎం.ప్రతాప్ రెడ్డిపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకమైన కేసు నమోదును చేసి దర్యాప్తు



మాట్లాడుతున్న తాలూకా సిఐ షేక్ ఖాజావలి

ప్రారంభించామన్నారు. ఒంగోలు అంజయ్య రోడ్డు ఎస్ఎస్ సెలూన్ - స్పా సెంటర్ లోని ఒక మహిళతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొనేందుకు వచ్చిన టంగుటూరు మండలం కొణిజేడుకి చెందిన మానం నాగరాజు, స్పా సెంటర్ల నిర్వాహకులు ఒంగోలుకి చెందిన తురిమెళ్ల పోతురాజుపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేశామన్నారు. ఒంగోలు బాలాజీరావు పేటలోని ఓ రేంజ్ యూనిసెక్స్ సెలూన్, స్పా సెంటర్‌లో నిర్వాహకుడు ఒంగోలు మంగమూరుడొంక కు చెందిన కొణిజేటి కన్నయ్య, ఒక మహిళతో పాటు, ఒంగోలుకు చెందిన శేషాచలం మానస, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన ముజాజొల్ హుస్సేన్‌పై కేసులు నమోదు చేశామన్నారు. స్పా సెంటర్ల నిర్వాహకులు, అనైతిక కార్యక్రమాలలో పాల్గొన్న వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. అనుమతులు లేని స్పా, స్నూకర్, రిక్రియేషన్ క్లబ్స్‌కు ఇళ్లను అద్దెకిచ్చి కేసులలో ఇరుక్కోవద్దని యజమానులకు సూచించారు. సమావేశంలో ఒంగోలు టుటౌన్ సిఐ జగదీష్, వన్‌టౌన్ సిఐ ఆలీ సాహెబ్ పాల్గొన్నారు.



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో 'చదవటం మా కిష్టం' కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. ముందుగా పిల్లలకు కథలు పుస్తకాలు ఇచ్చి చదివించారు. మంచికంటి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పుస్తకాల గొప్పతనం గురించి వివరించారు. ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ గురు పౌర్ణమి విశిష్టత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె. సంపూర్ణమ్మ, యస్.అనిల్, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

అల్పపీడనం ప్రభావంతో

సముద్రంలో ఆగిన వేట

ప్రజాశక్తి-శింగరాయకొండ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా చిన్నపాటి తుప్పర్ల వర్షం మొదలైంది. దీంతో మత్స్య కారులు సముద్ర వేటకు వెళ్లకుండా నిలుపుదల చేశారు. ప్రభుత్వం అప్రమత్తం చేయటంతో తుపాను ప్రభావం ఉంటుందేమోనని మత్స్య కారులు బోట్లు, వలలను ఒడ్డుకు చేర్చు కున్నారు. మూడు రోజులుగా వేటకు వెళ్లకుండా చిన్నపాటి తుప్పర్ల వర్షం తాకిడికి వేట నిలిపి

ఒడ్డుకు చేరిన బోట్లు, వలలు

వేశారు. శని, ఆదివారాలు సముద్ర తీరంలో అలలో ఉధృతి కూడా ఓ రకంగా ఉండటం వల్ల మత్స్యకారులు ఎక్కడ తుపాను ప్రభావం పడుతుందో అని, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు సముద్రం వద్ద ఉండి, అక్కడికి ఎవరినీ అనుమతించకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

బుద్ధుని ధర్మం అనుసరణీయం

- చుండూరు రంగారావు - ఘనంగా బుద్ధుని ధర్మ ప్రబోధ కార్యక్రమం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రపంచానికి వెలుగు మార్గం చూపిన బుద్ధుడు బోధించిన ధర్మం అనుసరణీయమని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు తెలిపారు. బుద్ధుని ప్రప్రథమ ధర్మచక్రం ప్రవర్తనం సందర్భంగా ప్రకాశం భవనం వద్ద బుద్ధుని ధర్మ ప్రబోధ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముందుగా బుద్ధుడు, ఐదుగురు శిష్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చుండూరు రంగారావు మాట్లాడుతూ బుద్ధుని ధర్మంలో అభూత కల్పనలకు తావులేదని, దుఃఖ నివారణకు అష్టాంగ మార్గం, పంచశీల, దశపారమితులు ఉన్నాయన్నారు. ప్రపంచానికి వెలుగు మార్గం చూపిన బుద్ధుని ధర్మం అనుసరణీయమన్నారు. ఆ తర్వాత 218 సంవత్సరాలకు రాజ్యాధికారానికి వచ్చిన బుద్ధుని మార్గంలో పరిపాలన చేసిన అశోకుడు బుద్ధుని ధర్మాన్ని ప్రపంచ వ్యాప్తి చేశాడన్నారు. ఒ.పిడి.ఆర్. రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర రావు బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి,సంఘం శరణం గచ్ఛామి అనే త్రికరణాలులను అందరి చేత పలికించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పి పేరయ్య,



నివాళులర్పిస్తున్న రంగారావు

రిటైర్డ్ గజిటెడ్ ఆఫీసర్ల సంఘం నాయకులు ఏ.సలార్, ఐ ఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఎం జార్జి, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, బహుజన సామాజిక రచయిత రెబ్బవరపు ఉదయ కుమార్, మెడికల్ ఎంప్లాయిస్ నాయకులు కొండేపి నాగేశ్వరరావు, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం నాయకులు అర్జా లక్ష్మి ప్రసాద్, సామాజిక రచయిత పిన్నిక శ్రీనివాసరావు, జై భీమ్ సేవాదళ్ నాయకులు జాలాది మోహన్, కార్మిక నాయకులు వి.శివరావు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు జే సుబ్బారావు, నరసింహారావు, రెడ్ స్టార్ నాయకులు కొమ్ము రాజేంద్ర, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిరుపయోగం

- **రూ.2.70 కోట్లతో పనులు పూర్తి**
- **అంతర్గత కనెక్షన్లు ఇవ్వకుండా చోద్యం చూస్తున్న అధికారులు**
- **లీకుల కారణంగా ప్రతిరోజూ సుమారు 40 ట్యాంకర్ల తాగు నీరు వృథా**
- **అధికారుల నిర్లక్ష్యం వల్ల భాగ్యనగర్ రోడ్డు పనులకూ ఆటంకం**



కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దాదాపు మూడు దశాబ్ధాల కిందట ఉన్న పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇందుకు గాను కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి రూ.2.70 కోట్లు నిధులు ఖర్చు చేశారు. పనులు కూడా పూర్తి చేశారు. పనులు పూర్తి అయ్యి నాలుగు మాసాలు అయ్యింది. అంతర్గత కనెక్షన్‌లు ఇస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతోంది. అయితే అధికారులు నాలుగు మాసాలుగా అంతర్గత కనెక్షన్లు ఇవ్వకుండా నాన్చుతున్నారు. వారి నిర్లక్ష్యం వల్ల రోజుకు సుమారు 40 ట్యాంకర్ల మంచినీరు లీకులు ద్వారా వృథా అవుతోంది.

హౌసింగ్‌బోర్డు కాలని డ్వామా ఆఫీసు వెనుక నుంచి భాగ్యనగర్ నాలుగో లైన్ ఆర్చి వరకు నగరంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపేందుకు గాను గ్రావిటి మీద పంపింగ్ కోసం పాత పైప్‌లైన్ ఉంది. ఇది దాదాపు 30ఏళ్ల కిందట ఏర్పాటు చేసింది. తరచు లీకులు వస్తుండటంతో నగరంలో దాదాపు నాలుగైదు ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. లీకుల వల్ల సుమారు 40 ట్యాంకర్ల తాగునీరు ప్రతిరోజు వృధాగా డ్రెయిన్లపాలవుతోంది. ఈ పరిస్థితి ఏళ్ల తరబడి ఉంది. పంపింగ్ లైన్ లీకులు అరికట్టేందుకు భాగ్యనగర్ నాలుగులైన్‌లో తరచు రోడ్డును తవ్వాల్సి వస్తుంది. పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వినప్పుడు ఆప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. పాత పంపింగ్ లైన్ స్థానంలో 600 ఎంఎం డయా కెపాసిటి కలిగిన కొత్త పైప్‌లైన్ ఏర్పాటు కోసం గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రస్తుత మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు చేతులుమీదుగా పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. నాలుగు మాసాలకిందట పనులు పూర్తి అయ్యాయి. కొండమీద ఫిల్టర్‌బెడ్ నుంచి నగరంలోని పలు ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే లైన్ కావడంతో ఈపైప్‌లైన్ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఇంత ప్రాధాన్యత కలిగిన పైప్‌లైన్ పనులు పూర్తి చేసి కూడా అసంపూర్తిగా వదిలేయడంతో అది కాస్తా నిరుపయోగంగా మారింది. పాత పైప్‌లైన్‌ను డమ్మి చేసి కొత్త పైప్‌లైన్‌ను వినియోగంలోకి తెస్తే సగానికి పైగా నగరానికి మేలు జరుగుతోంది.

రోడ్డు నిర్మాణానికి ఆటంకమే..

డ్వామా ఆఫీసు వెనుక వైపు నుంచి భాగ్యనగర్ నాలుగోలైన్ ఆర్చివరకు రోడ్డు మొత్తం అనేక ధపాలుగా తవ్వేవారు. దాదాపు 500 మీటర్ల రోడ్డు మీద ఎక్కడ చూసినా గుంతలు దర్శనమిస్తున్నాయి. పెద్ద పైప్‌లైన్ రోడ్డుకు కింద ఉండటంతో పాత పైప్‌లైన్ ఎప్పుడు లీకు వచ్చినా రోడ్డును భారీగా తవ్వాల్సిందే. ఈ లైన్‌మీద ఎప్పుడు పైప్‌లైన్ లీకు వచ్చినా నగరమంతా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పైగా బాగ్యనగర్ ముంపు ప్రాంతాల జాబితాలో ఉంది. నగరంలో ఓమోసార్తు వర్షం కురిస్తే ఆ ప్రాంతమంతా జలమయం అవుతోంది. కొత్తనీటి పైప్‌లైన్ వేసిన తరువాత పర్మినెంట్‌గా సిమెంటు రోడ్డు వేసి అందుకు అనుసంధానంగా డ్రెయిన్లు నిర్మిస్తే వరదముంపు నుంచి విముక్తి కలుగుతోంది. అందులో భాగంగా కొత్త పైప్‌లైన్‌ను వేసినా అంతర్గత కనెక్షన్‌లు ఇచ్చే పనులు చేయకపోవడంతో హౌసింగ్‌బోర్డు, భాగ్యనగర్ ప్రాంతం ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలోనే అంతర్గత కనెక్షన్లు ఇస్తాం..


రహంతు జానీ, కార్పొరేషన్ ఇంజినీర్

భాగ్యనగర్‌లో కొత్త పంపింగ్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయి. అంతర్గత కనెక్షన్లు మూడు చోట్ల ఇవ్వాలి. ఇటీవల చెరువుల్లో నీరు లేకపోవడం, ఇతరత్రా కారణాల వల్ల అంతర్గత కనెక్షన్‌లు ఇచ్చే పనులు ఆలస్యం అయ్యింది. ఈ విషయంపై కాంట్రాక్టర్‌తో చర్చించి అతి త్వరలోనే ఇంటర్ కనెక్షన్‌లు ఇచ్చే పనులు పూర్తి చేస్తాం. కొత్త పైప్‌లైన్‌ను వినియోగంలోకి తెస్తాం.

షంషీర్ అహ్మద్

స్మారక సమితి ఏర్పాటు అభినందనీయం

ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు



స్మారక సమితి బ్రోచర్, లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిబద్ధ ప్రభుత్వ అధికారి, కీర్తిశేషులు షంషీర్అహ్మద్ స్మారక సమితి ఏర్పాటు అభినందనీయమని ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు కాన్ఫరెన్స్ హాలులో విశ్రాంత డిప్యూటీ జాయింట్ కలెక్టర్ షంషీర్ అహ్మద్ స్మారక సమితి ఆవిర్భావం సందర్భంగా జరిగిన సభలో పలువురు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సభకు సమితి ఉపాధ్యక్షులు వైఎస్ దిగ్విజయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి మారుపేరుగా షంషీర్ అహ్మద్ నిలిచారని, ఉద్యోగ విరమణ తర్వాత కూడా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే వారన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయన అభిమానిగా ఉన్నారని, ఒక అధికారిగా కాకుండా ఒక సేవకుడిగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా ప్రజా ఉద్యమాలలో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ అందరివాడిగా బతికారన్నారు. స్మారక సమితి సమితి అధ్యక్షులు షబ్బీర్ అన్నాద్ మాట్లాడుతూ సమాజంలోని పేదల పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా భావితరాలకు ఆదర్శప్రాయుడిగా షంషీర్అహ్మద్ నిర్వహించిన పాత్ర అనితర సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఐ.వెంకటేశ్వరరెడ్డి కూడా షంషీర్ అహ్మద్తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సభానంతరం షంషీర్ అహ్మద్ స్మారక సమితి బ్రోచర్, లోగోలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారి కుమారులు జబీర్అహ్మద్, షబ్బీర్ అహ్మద్, అహ్మద్, ఉపాధ్యాయులు జిలానీ, సిపిఐ నాయకులు పివిఆర్ చౌదరి ప్రకాష్ రావు, ఎస్‌డి సర్దార్, ఉప్పుకూరి ప్రకాష్‌రావు, అడ్వకేట్ కరీముల్లా, నబీ కరీం ఖాన్, కె.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు ఎస్‌కె మాబు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో

విద్యారంగ సమస్యలు చర్చించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ డిమాండ్
- ప్రజాప్రతినిధులకు సంఘం నేతల లేఖలు



మాట్లాడుతున్న వినోద్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు విద్యారంగ సమస్యలను చర్చించి పరిష్కార దిశగా కషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో వినోద్ మాట్లాడుతూ పెండింగ్‌లోని హాస్టల్ మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుతున్న పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వాలని, పాత బకాయిల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్లస్-2 కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. డిగ్రీ విద్యలో ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దుచేసి మేజర్, మైనర్ వ్యవస్థలను తొలగించాలని కోరారు. ప్రకాశం జిల్లా కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలకు నిధులు కేటాయించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ సమాంతర మీడియాలలో బోధన అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 ప్రాథమిక విద్యకు ఉరి తాడుగా మారిందని, ఈ జీవోను రద్దు చేయాలన్నారు. తరగతుల విలీనం పేరుతో విలీనమైన పాఠశాలలను తిరిగి యధావిధిగా కొనసాగించాలని కోరారు. జీవోలు 42, 50, 52 ద్వారా గత ప్రభుత్వం ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రైవేట్‌పరం చేసినా వాటిని ఎయిడెడ్ విద్యా సంస్థలుగా తిరిగి కొనసాగించాలన్నారు. జీవో 35ను రద్దు చేసి పూర్తి ఎయిడెడ్ ఇవ్వాలని, కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు అమ్ముకునే విధంగా 107, 108 జీవోలను రద్దు చేయాలన్నారు. ఒంగోలు నగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు. పొన్నలూరు మండల కేంద్రంలో నిర్మించిన ఎస్‌టి గురుకుల పాఠశాల భవనాన్ని మిగిలిన 10 శాతం నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మార్కాపురం, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించి ఫీజుల్లో రాయితీలు కల్పించి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి అనుబంధంగా గవర్నమెంట్ ఇంజనీరింగ్, మైనింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురం గవర్నమెంట్ మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. 2025 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించాలన్నారు. చీమకుర్తిలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అక్కడే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దర్శిలో డ్రైవింగ్ పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలని, మార్కాపురంలో 1500 మంది బాలికలతో నడుస్తున్న పాఠశాల సంఖ్యకు అనుగుణంగా బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పొదిలిలో కాలేజీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని, ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సిఎంఇ, ఇసిఇ కోర్సులు ప్రారంభించాలన్నారు. కార్పొరేటు విద్యాసంస్థలను నియంత్రించాలని, విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.విజయ్, నగర కమిటీ సభ్యులు విజయకుమార్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయగానే

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం..

జిల్లా హౌసింగ్ ప్రధాన అధికారి పేరయ్య

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తామని జిల్లా ప్రధాన హౌసింగ్ అధికారి ఈమని పేరయ్య తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 20న 'గృహ నిర్మాణదారులకు అందని బిల్లులు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం కింద 2014 నుంచి 2019 మధ్య కాలంలో పక్కా గృహాలను వివిధ దశల్లో నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉందన్నారు. గృహ నిర్మాణ స్థాయిలకు సంబంధిత మండల సహాయక ఇంజనీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి ఆన్‌లైన్ లాగిన్‌లో బిల్లులు చేయడం జరిగిందని చెప్పారు. సదరు గృహ నిర్మాణ బిల్లులు లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతానందు జమ కావడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

పోలీసుల అదుపులో మట్కా నిర్వాహకులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -గిద్దలూరు

గిద్దలూరులో మట్కా కట్టడి దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నెల 18వ తేదీ గురువారం ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన 'యథేచ్ఛగా మట్కా' అనే కథనానికి పోలీసులు స్పందించారు. పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ప్రసాద్, షాహినా, మరో బాలుడిని అదుపులోకి తీసుకుని గిద్దలూరు తహసీల్దార్ ముందు బైండో ఓవర్ చేశారు. వీరిని లక్ష రూపాయల పూచీకత్తుతో విడిచిపెట్టినట్లు గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్య తెలిపారు.

తాగునీటినికి సాగర్ జలాలు విడుదల

ప్రజాశక్తి-త్రిపురాంతకం

తాగునీటి కోసం అధికారులు సాగర్ జలాలను విడుదల చేశారు. గుంటూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు 85/3 మైలు రాయి నుంచి జిల్లాలోకి సాగర్ జలాలు ప్రవేశించాయి. 1400 క్యూసెక్యులు మాత్రమే విడుదల చేయడంతో కాలువ నెమ్మదిగా సాగుతుంది. నాగార్జున సాగర్ నుంచి కుడి ప్రధాన కాలువకు 4.5 టిఎంసిల నీరు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కాగా సాగర్ కాలువ నుంచి నీరు చౌర్యం కాకుండా అధికారుల పర్యవేక్షణలో పోలీసులు పహారా కాస్తున్నారు.

సమగ్ర శిశు అభివృద్ధి,

మహిళా సంక్షేమమే లక్ష్యం

- అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం
- తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు
- ఐసిడిఎస్ ప్రాజెక్టు పీడీ కె.ఉష



ముఖాముఖి

ప్రజాశక్తి-బాపట్ల

సమగ్ర శిశు అభివద్ధి, మహిళా సంక్షేమమే లక్ష్యంగా జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా సంపూర్ణ బహుముఖ సేవలందిస్తోందని బాపట్ల జిల్లా ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఉష తెలిపారు. జిల్లాలో మహిళా, శిశు సంక్షేమం అభివద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆమె 'ప్రజాశక్తి'తో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు.

పిల్లల సమగ్రాభివద్ధికి అన్ని రకాల పునాది వేసేందుకు ప్రత్యేక ప్రాజెక్టును మహాత్మాగాంధీ 106వ జయంతి సందర్భంగా 1975, అక్టోబర్ 2న ఐసిడిఎస్ ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందన్నారు. పిల్లల అభివద్ధిని కొనసాగించి, చిన్నారుల్లో శక్తిని పెంపొందించేందుకు అవసరమైన పోషకపదార్థాలు లభించకుంటే పిల్లలు పోషకాహారలోపంతో బాధపడకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. పేదరికం, ఆకలి, లైంగిక వివక్ష, అవగాహనా లోపం, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం తదితర సమస్యలు పోషకాహార లోపానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం పిల్లల అభివద్ధికి పోషకాహారం అందించి, వారి సమగ్రాభివద్ధికి అన్ని విధాలుగా జిల్లాలో ఈ పథకం అమలవుతోందన్నారు.

ప్రధానంగా చిన్నారుల్లో భౌతిక, మానసిక, ప్రేరక, గ్రాహ్య శక్తి, సామాజిక అవగాహన తదితర అంశాల్లో పిల్లలు బాల్యం నుండి చురుగ్గా ఉండేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతోందన్నారు. నేటి చిన్నారులు భవిష్యత్తులో ఒక ఆరోగ్యకరమైన జీవితం జీవించడానికి ఈ అభివద్ధి ఒక పునాదిగా ఉపయోగపడుతుందన్నారు. ప్రత్యేకించి పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసు వచ్చే వరకు పిల్లలు వేగవంతంగా పెరగడానికి, అభివద్ధి చెందడానికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించడం జరుగు తుందన్నారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై చిన్నారులతో పాటు తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

జిల్లాలో 25 మండలాల్లో తొమ్మిది ఐసిడిఎస్ ప్రాజెక్టుల ద్వారా నాలుగు పురపాలక సంఘాల్లో 1888 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 8101 మంది గర్భిణీలు, 6688 మంది బాలింతలు, 28,531 మూడు నుండి ఆరేళ్లలోపు పిల్లలు, ఏడు నెలల నుండి మూడేళ్ల లోపు 38,576 మంది చిన్నారుల, సమగ్ర అభివృద్ధి కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా వివిధ సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో మొత్తంగా 1,888 అంగన్వాడీ కేంద్రాల్లో 809 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు. మరో 599 అద్దె భవనాలతో పాటు అద్దె లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానంగా నిర్వహించే 480 అంగన్వాడీ కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయన్నారు.

జిల్లా ప్రాజెక్టు పరిధిలో ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా జిల్లాలో 12 మంది సిడిపిఓలకు 10 మంది మాత్రమే ఉన్నారన్నారు. రెండు సిడిపిఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గ్రేడ్ -1, గ్రేడ్- 2 సూపర్వైజర్ పోస్టులు 77 మందికి 67 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. మరో 10 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఇక అంగన్వాడీలు 1872కు గానూ 1837 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. మరో 35 మంది అంగన్వాడీ కార్యకర్తలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. 16 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 16 మంది వర్కర్లు ఉన్నారు. హెల్పర్లు 1872 మందికి 1846 మంది ఉన్నారని చెప్పారు. మరో 26 మందిని భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు పరిధిలో బాలింతలు గర్భిణీలకు నెలకు మూడు కిలోల బియ్యం కిలో పప్పు అరకిలో నూనె, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో పాటు రాగి పిండి రెండు కిలోలు పల్లీల చెక్కిలు 250 గ్రాములు, ఖర్జూరాలు 250 గ్రాములు నెలలో అందజేస్తారని తెలిపారు. ఏడు నెలల నుండి మూడేళ్ల చిన్నారులకు బాలామృతం రెండున్నర కిలోలు కోడిగుడ్లు 25 పాలు రెండున్నర లీటర్లు చిన్నారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వండి పెట్టేందుకు ఆహార పదార్థాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అల్పాదాయ వర్గాలు, దారిద్ర రేఖకు దిగువన ఉన్న, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాల్లో చిన్నారులకు అనుబంధ పోషకాహారం అందించడం, రోగనిరోధకశక్తి పెంచడం, ఆరోగ్య పరీక్షలు, సూచనాత్మక సేవలు అందించడంతో పాటు మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు సూక్ష్మ గ్రహణ విద్యను అంగన్వాడీల ద్వారా అందిస్తున్నామన్నారు. అంగన్వాడీల సేవల ద్వారా చిన్నారులు క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. దీంతో బడిఈడు పిల్లలు పాఠశాలల్లో చేరని సంఖ్య తగ్గించేందుకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు.